



మహానాడు ఏర్పాట్లపై చర్చిస్తున్న పల్లా శ్రీనివాసరావు, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, రామగోపాల్‌రెడ్డి తదితరులు

చకచకా పనులు

- 25లోపు పూర్తి చేసేలా కసరత్తు
- భద్రతా ఏర్పాట్లపై కర్నూలు ఐజీ, డీఐజీల పరిశీలన
- 25న మంత్రి నారాలోకేశ్ రాక
- పనులను పర్యవేక్షించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 27, 28, 29తేదీల్లో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి వేదిక పనులు చకచకా సాగుతున్నాయి. 25వ తేదీలోపు అన్నీ పూర్తిచేసేలా చూస్తున్నారు. ప్రతినిధుల సభ వేదిక పనులు శరవేగంగా సాగుతున్నాయి. భోజనశాల, ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరం, వేదిక పక్కనే సీఎంవో క్యాంపు ఆఫీసు నిర్మిస్తున్నారు. ఇక చివరిరోజు నిర్వహించే బహిరంగసభకు సంబంధించిన వేదిక పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక మహానాడు ఏర్పాట్లను గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్ తదితరులు పరిశీలించారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఈ నెల 27 , 28, 29 తేదీల్లో మహానాడు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననుండటంతో బహిరంగసభల వేదిక వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం పబ్బాపురంలోని వేదిక వద్ద అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభాప్రాంగణంలో పారిశుధ్యం పనులు పక్కాగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. మెడికల్ ఎమర్జెన్సీ, ఫైర్, విద్యుత్, పోలీసు, రెవెన్యూశాఖలు అన్నీ ఏర్పాటు చేయాలని సూచించారు. తొలుత కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌లు మహానాడు వేదిక ప్రాంగణాన్ని, బహిరంగసభ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, డీపీవో రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో నాగరాజు, ఫైర్ ఆఫీసర్ ధర్మారావు పాల్గొన్నారు.



మహానాడు ఏర్పాట్లపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఐజీ పరిశీలన

సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు రానుండడంతో మహానాడు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ఐజీ (ఆపరేషన్స్) శ్రీకాంత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కడప, అన్నమయ్య, నంద్యాల, అనంతపురం జిల్లాల ఎస్పీలు అశోక్‌కుమార్, విద్యాసాగర్‌నాయుడు, అధిరాజ్‌సింగ్‌రాణా, జగదీశ్, గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా ఇతర పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. ప్రతినిధుల సభ, బహిరంగసభ వేదిక, సీఎంవో క్యాంపు ఆఫీసు, ఫుడ్‌కోర్టు, పార్కింగ్ ప్లేస్‌లు పరిశీలించారు. ఎక్కడెక్కడ భద్రత చేపట్టాలన్న దానిపై చర్చించారు. మహానాడుకు భారీ ఎత్తున జనం రానుండటంతో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది ఉండకూడదని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



మహానాడు వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఆపరేషన్స్ ఐజీ శ్రీకాంత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కడప, అన్నమయ్య, నంద్యాల, అనంతపురం జిల్లాల ఎస్పీలు

ప్రజల ఆకాంక్ష మేరకే కడపలో మహానాడు

చాలా ఏళ్ల తరువాత కడప జిల్లా ప్రజలు నిన్న జరిగిన ఎన్నికల్లో ఏడు సీట్లు కట్టబెట్టి వారి ఆకాంక్షను తెలిపారు. అందుకే ఇక్కడ మహానాడు నిర్వహిస్తున్నాం. రాయలసీమ, కడప అభివృద్ధికి కృషి చేస్తాం. ఇన్ని మహానాడులు నిర్వహించాం.. ఇంత అద్భుతమైన ప్లేస్ ఎక్కడా ఇంతవరకు దొరకలేదు. 25లోపు వేదిక పూర్తవుతుంది. 25న రాత్రికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కడపకు రానున్నారు. మహానాడు ఏర్పాట్లపై ప్రతిరోజూ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, ప్రధానకార్యదర్శి నారాలోకేశ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు నిర్వహిస్తాం. నేతలంతా సమష్టిగా పనిచేస్తున్నారు.

- పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు



వెల్లాలలో తమలపాకులతో ప్రత్యేక అలంకరణలో సంజీవరాయస్వామి

వైభవంగా హనుమజ్జయంతి

హనుమజ్జయంతి వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాలలో వేడుకగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా తమలపాకులతో అలంకరించి పూజలు చేశారు. ప్రొద్దుటూరు, బద్వేలు, కమలాపురం తదితర ప్రాంతాల్లో హనుమాన్ శోభాయాత్ర చేశారు. హనుమజ్జయంతి సందర్భంగా గండిక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు.



ప్రొద్దుటూరులో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కడప ఉపాధి కల్పన డీడీగా పద్మజ

కలికిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): కడప ఉపాధి కల్పన, శిక్షణ (జాబ్ డెవలప్‌మెంట్) డిప్యూటీ డైరెక్టరుగా ఎస్.పద్మజను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో డెప్యుటేషన్‌లో ఉన్న పద్మజకు గడువు ముగియడంతో మాతృ సంస్థకు తిరిగి వచ్చారు. దీంతో ఆమెను ఖాళీగా ఉన్న కడప ఉపాధి కల్పన కార్యాలయంలో డీడీగా నియమించారు. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ మరియు శిక్షణ శాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం ఉదయం 8గంటల వరకు జిల్లాలో సరాసరి 3.3 మి.మీ వర్షపాతం నమోదు కాగా చెన్నూరు మండలంలో 25 మిమీ అత్యధికంగా వర్షం పడింది. ఆకాశం మబ్బులు కమ్ముకుని ఉన్నా ఎక్కడా భారీ వర్షం కురవలేదు. చిరుజల్లులు మాత్రమే కురిశాయి. కమలాపురం మండలంలో 4.2 మిమీ, వల్లూరులో 5.8, ఒంటిమిట్ట 7.4, సిద్దవటం 8.6, కడప 1.6, సీకేదిన్నె 1.2, మైదుకూరు 6.4, బి.మఠం 1.2, పోరుమామిళ్ల 7.2, బికోడూరు 1.8, గోపవరం 1.0, దువ్వూరు 4.2, చాపాడు 7.6, లింగాల 17.2, వీఎన్‌పల్లె మండలంలో 2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పది ఎర్రచందనం దుంగలు స్వాధీనం
7


రూ.1.20 కోట్ల ప్రజాధనం వృథా
- నిరుపయోగంగా మారిన రైతుబజార్
- ఏడాది పూర్తయినా ఉపయోగంలోకి రాని వైనం

7

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

- రూ. కోటి విలువ గల బంగారం, వెండి వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాత్రి, పగలు అనే తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు పేరుమోసిన అంతర్ జిల్లాల దొంగల ముఠాను అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు నిందితుల వివరాలను వెల్లడించారు. రాజంపేట పట్టణం మన్నూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన చోరీ కేసుపై దర్యాప్తు ప్రారంభించిన రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే బుధవారం రాత్రి ఊటుకూరు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.కోటి విలువైన బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.లక్షా 40 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. విశాఖపట్టణం జిల్లా గాజువాక మండలం ఎర్రగడ్డ కాలనీలో నివాసం ఉంటున్న పశ్చిమగోదావరి జిల్లా కోయిలగూడెం మండలం గౌరవరం పంచాయతీ లక్కవరం గ్రామానికి చెందిన తోట శివకుమార్ అలియాస్ శివభవానీ, తిరుపతి జిల్లా భవానీనగర్‌లో నివాసం ఉంటున్న చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం మొరవారిపల్లె గ్రామానికి చెందిన జట్టి సుబ్రమణ్యం అలియాస్ సుబ్బు, రైల్వేకోడూరు మండలం మాధవరంపోడు గ్రామానికి చెందిన సూరేపల్లి వెంకటేశ్ అలియాస్ వెంకీ ముగ్గురు కలిసి అన్నమయ్య జిల్లాతో పాటు తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని బొమ్మూరు, నక్కలపల్లి, తిరుచానూరు, పీలేరు, రాయచోటి, రాజంపేట, ఓబులవారిపల్లి, మన్నూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పగలు, రాత్రి సమయాల్లో పలు చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితుడు తోట శివకుమార్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. అతడు తన అనుచరులైన సుబ్రమణ్యం అలియాస్ సుబ్బయ్య, సూరేపల్లి వెంకటేశ్ అలియాస్ వెంకీలతో కలిసి పలు జిల్లాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని రాత్రి, పగలు అనే తేడా లేకుండా చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనపర్చిన రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, మన్నూరు సీఐ ఎస్.కుళాయప్ప, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఓబులవారిపల్లె ఎస్ఐ సి.మహేశ్, సీసీఎస్ ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న రూ.కోటి విలువ గల బంగారం, వెండి వస్తువులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

జడ్పీలో బదిలీలకు వేళాయె

- జాబితా తయారీలో అధికారులు
- 25వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని ఆదేశం

కడప రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): జడ్పీలో ఉద్యోగుల బదిలీ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకే చోట 5 సంవత్సరాలు పూర్తిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని పేర్కొంది. జూన్ 2వ తేదీ లోపు బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. ఈ మేరకు పంచాయతిరాజ్‌శాఖ పరిధిలోని జిల్లా ప్రజాపరిషత్ శాఖలో ఉద్యోగుల బదిలీలకు కసరత్తు జరుగుతోంది.

బదిలీ జాబితాలో 30 శాతం మంది

రాష్ట్రప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా ప్రజాపరిషత్‌లో దాదాపు 30 శాతం మంది బదిలీ జాబితాలోకి చేరారు. జడ్పీలోని ఆయా విభాగాలలో 1,044 మంది ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిలో రెగ్యులర్ ఎంపీడీవో ఒకరు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు(ఏవో) 3, సీనియర్ అసిస్టెంట్లు 9 మంది, జూనియర్ అసిస్టెంట్లు 201 మంది, రికార్డు అసిస్టెంట్లు 28 మంది, అటెండర్లు 85 మంది, వాచ్‌మేన్‌లు, 18 మంది, డ్రైవర్లు ఒకరు ఉన్నారు. ఈ మేరకు బదిలీ జాబితాను అధికారులు సిద్ధంగా ఉంచారు.

బదిలీ జాబితాలోకి వచ్చే ఉద్యోగులు 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల మేరకు జడ్పీలోని ఆయా శాఖల పరిధిలో 5 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన వారికి తప్పనిసరిగా బదిలీలు ఉంటాయన్నారు. అలాగే క్రమశిక్షణా చర్యలు కానీ, శాఖాపరమైన చర్యలు ఉంటే కూడా బదిలీ అవుతారని తెలిపారు. వీరితో పాటు ఏవేని రిక్వెస్టు, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ కోరేవారు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2026 మే 31వ తేదీ లేదా అంతకు ముందు పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులకు రిక్వెస్ట్ లేదా అడ్మినిస్ట్రేటివ్ కారణాలపై తప్ప బదిలీలు ఉండవన్నారు.



బదిలీల్లో వీరికి ప్రాధాన్యత

విజువల్ చాలెంజ్డ్ ఉద్యోగులు, మానసిక వికలాంగులైన పిల్లలను కలిగి ఉన్న ఉద్యోగులకు, 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యాలున్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారము బదిలీల్లో సడలింపు ఇచ్చారు. అలాగే వైద్య కారణాలపై బదిలీ కోరుకునే ఉద్యోగుల జీవిత భాగస్వామి లేదా ఆధారపడిన పిల్లలు క్యాన్సర్, ఓపెన్ హార్ట్ ఆపరేషన్, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ మొదలైన దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతుంటే అటువంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్న స్టేషన్‌కు బదిలీ అవకాశం కల్పించారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- పాయింట్ల కేటాయింపునకు మార్గదర్శకాలు జారీ
- ముందుగా గ్రేడ్-2 హెచ్‌ఎంలకు స్థానచలనం
- ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఆమోదం

కడప ఎడ్యుకేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన చర్చలు సఫలం కావడతో టీచర్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీల ప్రక్రియ, తేదీలకు సంబంధించిన షెడ్యూల్‌తో పాటు పాయింట్ల కేటాయింపు తదితర మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. జూన్ 11వ తేదీ నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి కానుంది. బదిలీ అయ్యేవారంతా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఉపాధ్యాయ సంఘాల వినతి మేరకు ఎస్జీటీలకు మాత్రం మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.



ప్రాధాన్యత ఇలా

75శాతం దృష్టిలోపం లేదా 80శాతం శారీరక వైకల్యం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. 75శాతం దృష్టిలోపం, 70-79శాతం మధ్య శారీరక-వైకల్యం లేదా 70శాతానికి పైగా వినికిడి లోపం ఉన్నవారికి రెండో ప్రాధాన్యం కల్పిస్తారు. పునర్వివాహం చేసుకోని వితంతువులు, క్యాన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ, బోనోటీసీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేసుకున్నవారు, జీవిత భాగస్వామి లేదా పిల్లలు జువైనల్ డయాబెటీస్, తలసేమియా, హీమోఫీలియా, కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి సైతం ప్రాధాన్యం ఇస్తున్నారు.

పాయింట్ల కేటాయింపు ఇలా

కేటగిరీ1 (పట్టణ ప్రాంతాలు) సంవత్సరానికి ఒక పాయింట్, కేటగిరీ-2 (మున్సిపల్ ప్రాంతాలు) సంవత్సరానికి రెండు పాయింట్లు, కేటగిరీ 3 (గ్రామీణ ప్రాంతాలు) సంవత్సరానికి మూడు పాయింట్లు, కేటగిరీ-4 (మారుమూల ప్రాంతాలు) సంవత్సరానికి అయిదు పాయింట్లు, పనిచేసిన మొత్తం సర్వీస్ కాలానికి సంవత్సరానికి అర్థ పాయింట్, భార్య, భర్తలు ప్రభుత్వ ఉద్యోగులైతే ఐదు పాయింట్లు (ఒకరికి మాత్రమే వర్తిస్తుంది), అవివాహిత మహిళా ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు కేటాయిస్తారు. అలాగే 40-55శాతం మధ్య శారీరక వైకల్యం లేదా 60-70శాతం మధ్య వినికిడి లోపం ఉన్నవారికి ఐదు పాయింట్లు, 40శాతం దృష్టిలోపం లేదా 56 శాతం శారీరక వైకల్యం ఉన్నవారికి ఏడు పాయింట్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు ఐదు పాయింట్లు కేటాయిస్తారు. విడాకులు తీసుకుని మళ్లీ పెళ్లి చేసుకున్న మహిళా టీచర్లు, సైనిక విభాగాల్లో పనిచేసి టీచర్లుగా ఉన్నవారికి ఐదుపాయింట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను రెండేళ్లుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు, పునర్విభజనలో తప్పనిసరిగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు కేటాయిస్తారు.

జిల్లాలో ఉపాధ్యాయుల వివరాలు

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా 6,696 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో ప్రధానోపాధ్యాయులు 25మంది, ఉపాధ్యాయులు 1,845 మంది, సర్‌ప్లస్ జాబితాలోని ఉపాధ్యాయులు 621 మంది తప్పనిసరి బదిలీల జాబితాలో ఉన్నారు. వీరితో పాటు రెండేళ్ల సర్వీసు పూర్తితో దరఖాస్తు చేసుకునేవారు మరికొంతమంది ఉన్నారు. బదిలీల ప్రక్రియ అంతా పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తిచేయనున్నారు. అలాగే జిల్లాలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటుచేయనున్న మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

బదిలీ ప్రక్రియ తేదీల వారీగా

వివరాలు	హెచ్‌ఎంలు	ఎస్‌ఏ	ఎస్జీటీలు
బదిలీల దరఖాస్తుకు	22 వరకు	24 వరకు	27 వరకు
దరఖాస్తుల పరిశీలన	22 వరకు	25 వరకు	28 వరకు
ప్రొవిజనల్ సీనియార్టీ జాబితా	24న	26 నుంచి 27 వరకు	31న
జాబితాపై ఫిర్యాదుల స్వీకరణ	25న	28న	28 నుంచి జూన్ 1 వరకు
ఫిర్యాదులపై పరిష్కారం	26న	28 నుంచి 28 వరకు	28 నుంచి జూన్ 2 వరకు
ఫైనల్ సీనియార్టీ జాబితా	27న	31న	జూన్ 6న
వెబ్ ఆప్షన్ నమోదు	28న	జూన్ 1, 2 తేదీల్లో	జూన్ 7 నుంచి 10 వరకు (మాన్యువల్‌గా కౌన్సెలింగ్)
బదిలీల ఆర్డర్లు జారీ	30న	జూన్ 4న	జూన్ 11న

54,095 లీటర్ల సారా ఊట ధ్వంసం

● 191 కేసుల నమోదు, 151 మంది అరెస్ట్

● 501 మంది బైండోవర్





పీలేరు మండలం అవులయ్యగారిపల్లె వద్ద సారా ఊట ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటోలు)

- ● ఒకరిపై రెండు కేసులకు మించితే పీడీ యాక్ట్
- ● లక్కిరెడ్డిపల్లె, రాజంపేటలో సారా కేసులు నిల్
- ● జూలై 31 నాటికి సారా రహిత జిల్లాగా అన్నమయ్య
- ● నవోదయంలో 325 మందికి స్వయం ఉపాధి కోసం ప్రతిపాదనలు
- ● ఆంధ్రజ్యోతితో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్

పీలేరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటు సారా తయారు చేస్తున్న పలు అటవీ ప్రాంతాలలో మెరుపు దాడులు నిర్వహించి 54,095 లీటర్ల సారా ఊట ధ్వంసం చేశామని అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ తెలిపారు. గురువారం ఆయన పీలేరులో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ నుంచి నవోదయం కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ప్రారంభించామని చెప్పారు. నాటుసారా తయారు చేయడం, విక్రయించడం వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ వారిలో పరివర్తన తీసుకురావడం కోసం ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మెరుపు దాడులు నిర్వహించి ఫిబ్రవరి 19 నుంచి ఇప్పటి వరకూ పలు కేసులు నమోదు చేసి అనేక మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. జూలై 31వ తేదీ నాటికి సారా రహిత జిల్లాగా అన్నమయ్యను ప్రకటించడం కోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో పోలీస్, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు సిబ్బందితో ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉన్నతమైన లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

పరివర్తన కోసం..

నాటుసారా కాచడం, విక్రయించడమే జీవనాధారంగా ఉన్న వారిలో పరివర్తన తీసుకు రావడం కోసం నవోదయం కార్యక్రమంలో భాగంగా 30 శాతం సబ్సిడీతో బ్యాంక్ రుణాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకూ జిల్లాలో 325 మంది జాబితాతో కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆవులు, కుట్టుమిషన్లు, కిరాణా షాపు తదితర స్వయం ఉపాధి కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. నవోదయం కార్యక్రమం ఫిబ్రవరి 19వ తేదీన ప్రారంభించి మొదటి 40 రోజులు నాటు సారా కాచడం, విక్రయించడం వల్ల పేదల జీవితాలు ఎలా దుర్భరమౌతున్నాయో వివరించామని తెలిపారు. సారాకు బానిసలు కావడంతో రోగాల బారిన పడి జీవితాలను చేజేతులారా నశనం చేసుకుంటున్నారని ప్రజలకు వివరించామని అన్నారు.

జిల్లాలో నాటుసారా ప్రభావిత గ్రామాలు

పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటు సారా ప్రభావిత గ్రామాలు రామానాయక్ తండా, మద్రిమాకులపల్లె, అవులయ్యగారిపల్లె తండాలు, జిళ్లేళ్ల మంద, బురుజుకాడపల్లె, వగళ్ల, ఎనుగొండపాళ్యం, దిగువతండాలు ఉన్నాయి. మదనపల్లె పరిధిలో నారమాకులతండ, కోటవారిపల్లె, తుమ్మలతండ. ములకలచెరువులో కోటకొండ, రామానాయక్ తండాలు ఉన్నాయి. వాల్మీకిపురం పరిధిలో దిగువ, ఎగువమేకలవారిపల్లె, షికారు పాళ్యం.. రాయచోటిలో శెట్టిపల్లె, పెద్దబిడికీ, పరికలబండ.. రైల్వేకోడూరు పరిధిలో వై.కోట, బోడుగుట్టపల్లెలను అత్యంత సారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించారు.

కేసుల వివరాలు..

పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 66 కేసులు నమోదు చేసి 40 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే వారి వద్ద 157 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 15,270 లీటర్ల ఊట ధ్వంసం చేసి 315 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లెలో 39 సారా కేసులలో 48 మందిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద 592 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 2,920 లీటర్ల ఊట ధ్వంసం చేసి రెండు వాహనాలను సీజ్ చేశారు. ములకలచెరువులో 37 కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద 96 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 4075 లీటర్ల ఊట ధ్వంసం చేశారు. వాల్మీకిపురం సర్కిల్ పరిధిలో 31 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద 92 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 13,600 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి 100 కిలోల బల్లం స్వాధీనం చేసుకున్నారు. రైల్వేకోడూరులో 12 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్ట్ చేసి 48 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 17,060 లీటర్ల ఊట ధ్వంసం చేసి 26 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. రాయచోటిలో 6 కేసులు నమోదు చేసి 10 మందిని అదుపులోకి తీసుకొని 86 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1170 లీటర్ల ఊట ధ్వంసం చేసి రెండు వాహనాలు సీజ్ చేశారు.

రెండు కేసులుంటే పీడీ యాక్ట్..

నాటుసారా తయారు చేయడం, విక్రయించడం, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఈ హెచ్చరించారు. ఒకే వ్యక్తిపై రెండు కేసులు నమోదైతే అతనిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. అలాగే సారా తయారు చేసేవారికి నల్లబెల్లం సరఫరా చేసినా తీవ్రంగా పరిగణిస్తామని చెప్పారు. నిందితులు ఎవరైనా ఎంతటి వారైనా ఉపేక్షించేది ఉండదని హెచ్చరించారు.

రూ.1.57 లక్షల జరిమానా



జిల్లా వ్యాప్తంగా పలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకూ 501 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. వీరిలో మళ్లీ సారా విక్రయాలకు పాల్పడిన 18 మందిపై కేసు నమోదు చేసి రూ.1.57 లక్షల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ చెప్పారు. కాగా.. అన్నమయ్య జిల్లా పరిధిలో లక్కిరెడ్డిపల్లె, రాజంపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో సారా కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

నేడు పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం

హాజరుకానున్న రాయలసీమ జిల్లాల ఉద్యాన శాస్త్రవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరాజులు

రైల్వేకోడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో శుక్రవారం పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు ఉద్యాన విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు తెలిపారు. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో జరగబోవు కార్యక్రమాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో సాగులో ఉన్న వివిధ రకాల ఉద్యాన పంటలు, వాటి సాగు స్థితిగతులు, పరిష్కార మార్గాల దిశగా తీసుకోవాల్సిన చర్యలు, నూతన పరిశోధనలకు అవకాశం తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ పరిశోధన, విస్తరణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారని తెలిపారు. నాలుగు సంవత్సరాల తర్వాత ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించనున్న ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశాలకు రాయలసీమ జిల్లాల నుంచి ఉద్యానశాఖ అధికారులు, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉద్యాన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల ప్రగతి నివేదికపై చర్చిస్తారన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ ముఖ్యఅతిథిగా హజరౌతున్నట్లు ఆయన వివరించారు. రైతులు పండించిన పండ్ల రకాలను ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ కేటీ వెంకటరమణ, డాక్టర్ సి.మధుమతి, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల డీన్ పీటీ శ్రీనివాసులు, ఉద్యాన కళాశాలకు చెందిన సదరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

సుండుపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా తిరునాళ్లు, జాతరలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో హిందూ, ముస్లింల మత పెద్దలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలు తిరునాళ్లు, జాతరలు, పండుగలు ఉన్నాయని, ఎక్కడా కూడా వాటికి భంగం కలగకుండా నిర్వహించుకోవాలని కోరారు. చాందినీబండ్ల దగ్గర అసాంఘీక కార్యలాపాలు నిర్వహించేలా ప్రోత్సహించడం, మద్యం తాగి మత్తులో గలాటాలు సృష్టించడం వంటివి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపైన జాతర సమయంలో బండ్ల వద్ద రెచ్చగొట్టేలా మాట్లాడడం, విమర్శలు చేయడం వంటివి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి చాందినీబండి వద్ద ఇద్దరు పోలీసు సిబ్బంది ఉంటారని మసీదుల దగ్గర అల్లరి మూకలు అల్లర్లు చేయాలనుకుంటే తాట తీస్తామన్నారు. తిరునాళ్లు, జాతరలకు చాందినీబండ్లు కట్టే భక్తులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసులు, మత పెద్దలు పాల్గొన్నారు.

మదనపల్లె విద్యార్థినికి రాష్ట్ర స్థాయి బయోడైవర్శిటీ అవార్డు



డిప్యూటీ సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న గుణవిజయ

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయో డైవర్శిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో మదనపల్లెకు చెందిన డిగ్రీ విద్యార్థిని గుణవిజయ ప్రథమ అవార్డు అందుకున్నారు. గురువారం విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. వారం రోజుల క్రితం ఎస్వీ యూనివర్శిటీ బయోడైవర్శిటీ గురించి నిర్వహించిన పోటీల్లో స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థిని గుణవిజయ పాల్గొని వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ బయోడైవర్శిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.విజయకుమార్, ఐఎఫ్ఎస్ అధికారుల సమక్షంలో ప్రథమ బహుమతి అందుకున్నారు. డిప్యూటీ సీఎం చేతుల మీదుగా సర్టిఫికెట్, జ్ఞాపిక అందుకున్నారు. కాగా ఆ విద్యార్థినిని కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, బయోటెక్నాలజి హెచ్‌వోడీ డాక్టర్ రమ్య అభినందించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన అవసరం

ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా అధికారి వెంకటమోహన్



నవధాన్యాల సాగుపై రైతులకు వివరిస్తున్న వెంకటమోహన్

రాయచోటిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల (పీఎండీస్) సాగుపై రైతులకు అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా అధికారి వెంకటమోహన్ తెలిపారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు యూనిట్ లోని ఏపిలవంకపల్లిలో శంకరమ్మ పొలంలో నవధాన్యాల సాగు ఏ విధంగా చేపట్టాలి. ఎకరాకు ఎన్ని కిలోల విత్తనాలు వేయాలి, ఘనజీవామృతం ఎకరాకు ఎంత వేయాలి అనే అంశాలపైన రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సాగు డివిజన్ ఇన్‌చార్జి రమణనాయక్, మండల ఇన్‌చార్జి వంశీ, యూనిట్ ఇన్‌చార్జి హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

వాహనాల దొంగతనం కేసులో జైలుశిక్ష

ఓబులవారిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): వాహనాల దొంగతనం కేసుల్లో నిందితులకు కోర్టు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఈ ఏడాది జనవరి 7వ తేదీ కొర్లకుంట క్రాస్‌రోడ్డు వద్ద అయ్యప్పరెడ్డిపల్లె గ్రామానికి చెందిన లావనూరు దామోదర్ మోటారు సైకిల్‌ను సత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రం గ్రామానికి చెందిన పఠాన్‌సాహెబ్ దొంగలించాడు. విచారించి మోటారు సైకిల్‌ను రికవరీ చేసి నిందితుడిని రైల్వేకోడూరు కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ తేజసాయి 2 నెలల జైలుశిక్ష విధించారు. అలాగే మంగంపేట అగ్రహారంలో పసుపులేటి బాలాజి ఇంటి వద్ద ఉంచిన ఆటోను 2025 జనవరి 25వ తేదీ రాత్రి అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన వడ్ల శివశంకరాచారి చోరీ చేశాడు. ఈ కేసులో కూడా మేజిస్ట్రేట్ నిందితుడికి ఒకటిన్నర నెల సాధారణ జైలుశిక్ష విధించారు.

టీడీపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం

● టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వైసీపీ భరతం పడతాం : చమర్తి ● జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలోనే పనిచేయండి : దుర్గాప్రసాద్







ఎడ్లబండిపై ర్యాలీగా వస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, దుర్గాప్రసాద్, జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

రాజంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పటిష్ఠతకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దుర్గాప్రసాద్‌లు పిలుపునిచ్చారు. గురువారం రాజంపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమంలో జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలు అనవసరంగా టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వారి భరతం పడతామని హెచ్చరించారు. ఈనెల 27 నుంచి మూడురోజుల పాటు కడపలో జరిగే మహానాడు కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ సత్తా చాటుదామని చెప్పారు. పార్టీ నియోజకవర్గ కార్యకర్తలకు ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటానని చమర్తి వెల్లడించారు. అందరూ వ్యక్తిగత విభేదాలు మాని నియోజకవర్గంలో టీడీపీ పూర్వ వైభవానికి, పార్టీ పటిష్ఠతకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో రాజంపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి వచ్చే స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేటలో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

పార్టీ పరిశీలకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎవరూ వ్యక్తిగత అజెండాలకు పోకుండా కార్యకర్తలకు ఏ పని కావాలన్నా, పార్టీ కార్యక్రమాలను, అభివృద్ధి కార్యక్రమాలను టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలోనే చేసుకోవాలన్నారు. సీనియర్ టీడీపీ నాయకుడు, ఆర్టీసీ మాజీ ఛైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, మాజీ మండలాధ్యక్షులు పారా సుబ్బానాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి, జిల్లా తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత నాయుడు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండూరు శరత్‌కుమార్‌రాజు తదితర మండల నాయకులు, సీనియర్ టీడీపీ నాయకులు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమానికి రాజంపేట నియోజకవర్గం నుంచి 30 వేల మంది కార్యకర్తలను తీసుకెళ్లదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎద్దుల బండ్లపై నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు భారీ ఎత్తున భోజనం ఏర్పాటు చేశారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం

● రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ టెస్ట్-2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకు ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి.మోక్షిత్ 400 మార్కులకు గాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడన్నారు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వి.నిహార్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. వీరితో పాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/9399976999లలో సంప్రదించాలని సూచించారు.

దేశ సమైక్యత కోసం పాటుపడాలి



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

లక్కిరెడ్డిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత కోసం అందరూ పాటుపడాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా గురువారం లక్కిరెడ్డిపల్లెలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడురోడ్ల కూడలి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్‌కు సంతాపం తెలిసి కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదన్‌మోహన్, షేక్ ఆరీఫ్, రెడ్డెయ్య, డాక్టర్ షఫీనాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో చక్రేనాయక్, ఎంపీడీవో ఉషారాణి, పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరానికి పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యాధికారులు

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ శివారులోని వడ్డిపల్లె వద్ద కుక్కల దాడిలో జింక మృతి చెందింది. గురువారం వేకువజామున వడ్డిపల్లె సమీపంలోని మాదినకొండ అటవీ ప్రాంతం నుంచి ఓ జింక పిల్ల అడవి దాటి జనావాసాల్లోకి వచ్చింది. ఇది గమనించిన వీధి కుక్కలు జింకను తరమడంతో పాటు దాడి చేసి చంపేశాయి. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్‌ఓ జయప్రసాదరావు ఆదేశాలతో డీఆర్‌వో మదనమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని మదనపల్లె పశువుల ఆస్పత్రికి తరలించారు. అక్కడ పశువైద్యశాఖ ఏడీ రోహిణి ఆధ్వర్యంలో జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం జింక కళేబరాన్ని సమీప అడవిలో పూడ్చి పెట్టారు.

వివాదాస్పద నిర్మాణాలపై సబ్‌కలెక్టర్ విచారణ

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ రెవిన్యూ భవన్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న పునాదులపై సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ విచారణకు ఆదేశించారు. గురువారం కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన సబ్‌కలెక్టర్ ఆ స్థలం వెనక నిర్మిస్తున్న పునాదులపై ఆరా తీశారు. ఆ స్థలం ప్రభుత్వ స్థలమా, అందులో ఎవరికైనా లబ్ధిదారులకు కేటాయించారా అని తహసీల్దార్ ధనంజయులును ప్రశ్నించారు. దీనిపై పూర్తిగా విచారించి తనకు నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బీఎంపీ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంలో రామ్లానాయక్ కుమారుడు ఎం.కృష్ణానాయక్ కర్ణాటక మద్యం తరలిస్తుండగా బీఎంపీపీ సీఐ సత్యనారాయణ, సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 130 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

రూ.1.20 కోట్ల ప్రజాధనం వృథా



వేంపల్లెలో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్

- నిరుపయోగంగా మారిన రైతుబజార్
- ఏడాది పూర్తయినా ఉపయోగంలోకి రాని వైనం



రైతు బజార్‌లో ఉన్న స్టాల్స్

వేంపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట ఉత్పత్తులను స్వయంగా అమ్ముకొని లాభపడాలన్న ఉద్దేశ్యంతో రైతు బజార్ నిర్మించారు. ఏడాది క్రితం నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించారు. అయితే పలు రకాల కారణాలతో ఇప్పటి వరకు రైతు బజార్ ఉపయోగంలోకి రాకపోవడంతో రూ.1.20 కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా తయారైంది.

వేంపల్లెలోని ఆర్అండ్‌బీ అతిథి భవనంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన రైతు బజార్‌ను నిర్మించారు. రూ.1.20 కోట్లతో నిర్మించి.. గతేడాది మే నెలలో ప్రారంభించారు. అందులో 8 షాపింగ్ గదులు 44 స్టాల్స్ ఏర్పాటు చేశారు. రైతులు తక్కువ అద్దెతో స్టాల్స్, దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు తెలిపారు. అయితే పంచాయతీ పరిధిలో కడప రోడ్డులో ప్రైవేటు కూరగాయల మార్కెట్ నడుస్తోంది. ఈ కారణంగా రైతుబజార్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు, రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. వ్యవసాయశాఖ అధికారులు ఎన్నిమార్లు రైతులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి చెప్పిన రైతు బజార్‌లోకి వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. ప్రైవేటు కూరగాయల మార్కెట్ మూసేస్తే ఇక్కడకు వస్తారని చెప్పినా, వేలంలో ప్రైవేటు కూరగాయల మార్కెట్ షరతు ఉందని, ఏడాది వరకు మార్చలేమని చెప్పడంతో రైతు బజార్ నిరుపయోగంగా ఉంది. రైతు బజార్‌ను తెరిచి ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

రైతు బజార్‌ను తెరిచి రైతులకు ఉపయోగపడేలా సహకరించాలని స్థానిక పంచాయతీ అధికారులను కోరుతూనే ఉన్నాం. ఇప్పటికి పలుమార్లు లేఖ రాశాం. నెల అద్దె రూ.80వేలను నిర్ణయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ జీఓను పంచాయతీ అధికారులకు అందించాం. స్థానిక పంచాయతీ పాలకమండలి ఈఓ చర్చించి రైతు బజా ర్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని కోరుతున్నాం.

-రుచిత, రైతు బజార్ అధికారిణి, వేంపల్లె

పంచాయతీకి... నెల అద్దెకు

రైతులు స్వయంగా రైతు బజార్‌లోకి రాలేదన్న కారణంతో వ్యవసాయశాఖ మార్కెటింగ్‌శాఖ అధికారులు పంచాయతీకి అప్పగించాలని నిర్ణయించారు. నెల అద్దె రూ.1.20 లక్షలు చెల్లించాలని, పంచాయతీ ఆధ్వర్యంలోనే రైతు బజార్‌ను నడుపు కోవాలని... ఈ మేరకు కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై కలెక్టర్ డీపీఓతో చర్చించి నెల అద్దె రూ.80వేలు చెల్లించాలని కడప పంచాయతీ అధికారిణికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు కూడా ఇప్పటి వరకు ఆచరణలోకి రాలేదు. వేంపల్లెలో ప్రస్తుతం ఈఓ లేని కారణంగా మార్కెట్ వేలం గడువు ముగిసినా కొత్త టెండర్ పిలువలేదు. కొత్త ఈఓ రామసుబ్బారెడ్డి జాయిన్ అయి వారం రోజులకే లీవ్‌పెట్టి వెళ్లడంతో మార్కెట్ టెండర్ వేలంకు ఆస్కారం లేకుండా పోయింది. దీంతో రైతు బజార్ సమస్యను పరిష్కరించే ఆస్కారం లేకుండా పోయింది. ఇటు రైతు బజార్ తెరవాలంటే కొత్త వేలం టెండర్‌లో అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పంచాయతీ ఈఓ వచ్చిన తర్వాత రైతు బజార్ భవితవ్యం తేలే అవకాశం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జిల్లేళ్ల వద్ద రాళ్లు విరిగిపడి పాడైన తూము

కేసీ తూములు ఇలా...

- పాడైన షట్టర్లు... గేర్‌బాక్స్‌లు
- ఆందోళనలో రైతులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

దువ్వూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతన్నలకు జీవనాధరం కేసీ కాలువ. కేసీ కెనాల్ కింద జిల్లా పరిధిలో 82,937 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతియేటా సకాలంలో వర్షాలు పడితే కేసీ కెనాల్‌కు నీటి సరఫరా జరిగి పంటలు సస్యశ్యామలంగా పండుతాయి. శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా ప్రతి యేటా కేసీ కాలువకు నీరు అందుతుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో పొలాలను తడిపే కేసీ తూముల షెట్టర్లు పాడైపోయాయి. కేసీ కాలువకు నీటి ప్రవాహం ఉన్న సమయంలో పాడైన షట్టర్లు, గేర్‌బాక్స్‌లు మొరయిస్తున్న కారణంగా నీరు వృథా అవుతోంది. వీటి మరమ్మతులపై నీటిపారుదల శాఖ దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మైదుకూరు నియోజకవర్గం పరిధిలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట మండలాల పరిధిలో కేసీ కాలువ కింద 55,872 ఎకరాల ఆయకట్టు ఉంది. వరి, పసుపు, వేరుశనగ, జొన్న తదితర పంటల సాగుపై రైతులు ఆసక్తి కనపరుస్తారు. ఈ నేపథ్యంలో కాలువ పరిధిలో తూముల నిర్వహణ సరిగా లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవతున్నారు. దువ్వూరు మండల పరిధిలో మొత్తం 15 తూములు ఉన్నాయి. వాటికున్న షట్టర్లు, సామాగ్రి రాంసాయినగర్, జిల్లేళ్ల, ఏకోపల్లి, భీమునిపాడు, అన్నపుశాస్త్రులపల్లి పరిధిలో పాడైనట్లు రైతులు వాపోతున్నారు. వీటితోపాటు తూముల్లోని గేరుబాక్సులు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. ప్రతియేటా సకాలంలో వర్షాలు పడితే ఆగస్టులో నీటి సరఫరా జరుగుతోంది. వీటి మరమ్మతుల పనులు చేపడితే నీటి వృథాకు ఆస్కారం లేకుండా రైతులు సద్వినియోగం చేసుకుంటారు.

జిల్లాలో మైదుకూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు రాజుపాళెం, ప్రొద్దుటూరు, చెన్నూరు, వల్లూరు, చింతకొమ్మదిన్నె, కడప మండలాల పరిధిలోని కేసీ తూముల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని ఆయా ప్రాంతాల రైతాంగం కోరుతోంది. ఏడాది కిందట రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇరిగేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.350 కోట్లు కేటాయించినట్లు అధికార వర్గాలు తెలుపుతున్నాయి. ఈ నిధులు అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తే తాగు, సాగునీటికి తాత్కాలిక ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చునని భావిస్తున్నారు. ఏది ఏమైనా తూముల బాగోగులపై శ్రద్ధ వహిస్తే రైతుల పొలాలకు నీరు అంది పంటలు పండే అవకాశం ఉంది. ఈ విషయంపై దువ్వూరు సెక్షన్ కేసీ కాలువ ఏఈ పవన్‌కుమార్ వివరణ ఇస్తూ... తూముల మరమ్మతులపై దృష్టి సారించినట్లు తెలిపారు. దెబ్బతిన్న వాటి పనుల కోసం ఇంతకుమునుపే టెండర్లు జరిగాయని, వాటి పనులు త్వరలో చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.





షట్టర్‌లేని రాంసాయినగర్‌వైపు పొలాల తూము, తుప్పుపట్టిన ఏకోపల్లె తూము షట్టర్

ఘనంగా ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు

చక్రాయపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. గురువారం ఉదయం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, మన్యసూక్త హోమం, ఆంజనేయస్వామి మూలమంత్ర హోమం, సుదర్శన హోమం, సోమకుంభ ఉద్వాసన, మహాపూర్ణాహుతి, హోమగుండ ప్రోక్షణ అనంతరం తీర్థప్రసాదాల వినియోగం గావించారు. సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో యజ్ఞాచార్యులు ధర్మగిరి వేద పాఠశాల అధ్యాపకులు శ్రీమన్ రామానుజార్యులు బృందం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో గండిక్షేత్రం కిటకిటలాడింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3వరకు క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 5వేల మంది భక్తులకు ఎర్రగుంట్లకు చెందిన ఓబుల్‌రెడ్డి, రమాదేవి దంపతలు, అప్పకుండు వెంకట సుబ్బారెడ్డి, సునీత దంపతులు అన్నదానం చేశారు. కాగా, స్వామివారి నిత్యా న్నదాన పథకానికి గండి క్షేత్రానికి చెందిన ఎద్దుల రాజశేఖర్, పార్వతి దంపతులు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. బద్వేలుకు చెందిన పొన్నపోలు బ్రహ్మానందరెడ్డి, ఆదిలక్ష్మి రూ.51వేలు, వేంపల్లెకు చెందిన గురుమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య మునెమ్మ రూ.25,116 విరాళంగా ఇచ్చారు. కాగా, ఉత్సవాల సందర్భంగా ప్రొద్దుటూరుకు చెందిన మహిళలు కోలాటాలు ఆకట్టుకున్నాయి. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, అర్చకులు గోపాలస్వామి, రామమోహన్‌శర్మ, దేవస్థాన చైర్మన్ కృష్ణ తేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



మహాపూర్ణాహుతిలో భాగంగా అగ్నికి ఆహుతి ఇస్తున్న ద్రవ్యాలు

వెల్లాలో వైభవంగా....

రాజుపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల చెన్నకేశవ సంజీవ రాయస్వామి పుణ్యక్షేత్రంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సంజీవరాయస్వామికి తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ఆకుపూజలు, వడమాల తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఒంటె వాహనంపై సంజీవరాయస్వామి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒంటెవాహనంలో ఊరేగుతున్న సంజీవరాయస్వామి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన కుమార్

చాపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లె కుమార్ (38) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొత్తరాజువారిపేట గ్రామానికి చెందిన కుమార్ ప్రొద్దుటూరు నుంచి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అతని తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మినీ లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం

- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన రాజేశ్, రాహుల్

చెన్నూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూరుకు చెందిన రాజేశ్ (17), రాహుల్ (17) ద్విచక్ర వాహనంపై కడపకు వెళుతుండగా వారి ముందు వెళుతున్న మినీ లారీ ఎదురుగా గేదె అడ్డం రావడంతో బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పి వెనక వైపు మినీ లారీని ఢీకొ న్నారు. ఈ సంఘటనలో రాహుల్ తలకు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. రాజేశ్ కూడా గాయపడ్డాడు. ఇరువురిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంజనేయస్వామికి వెండి ఆభరణాలు వితరణ





వెండి ఆభరణాలను సమర్పిస్తున్న టీడీపీ నాయకులు, అలంకరించిన వెండి ఆభరణాలతో ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురువారం ఆంజనేయస్వామికి రెండు కిలోల వెండి కవచం, పాదాలు, కిరీటం వితరణగా ఇచ్చారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎన్నికల్లో గెలిస్తే ఆంజనేయస్వామికి వెండి ఆభరణాలు చేయిస్తానని ఆయన మొక్కుకున్నారు. తన కోర్కె నెరవేరడంతో హనుమాన్ జయంతి సందర్భంగా వెండి ఆభరణాలను మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య చేతుల మీదుగా ఆలయపూజారికి అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి ఆంజనేయస్వామికి నూతన ఆభరణాలను అలంకరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, కేసీకెనాల్ వైస్‌చైర్మన్ లక్ష్మీపేట గురివిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటికో పారిశ్రామికవేత్త.. ప్రభుత్వ లక్ష్యం



ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సీకేదిన్నె, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నెలో బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహించే ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో చంద్రబాబునాయుడు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేశారన్నారు. అదే స్ఫూర్తితో మహిళలు ఉన్నత స్థాయికి చేర్చేందుకు ప్రతి ఇంటి నుంచా పారిశ్రామికవేత్త తయారు కావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలో కమలాపురంతో పాటు చింతకొమ్మదిన్నెలో ఉచిత కుట్టుమిషన్ల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం మండలంలోని ఆజాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సృజల స్రవంతి మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్టారెడ్డి, మోహన్‌బాబు, పీరూప్రసాద్, రాజారావు, నజీర్, శంకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, గోవింద, వెంకటసుబ్బయ్య అధికారులు పాల్గొన్నారు.

పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం... కేసు

వేముల, మే 22 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బాలికపై 17ఏళ్ల బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలో ఓ బాలిక (మూగ,చెవిటి) ఇంట్లో ఉండగా ఓ బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి గమనించి గట్టిగా అరవడంతో నిందితుడు అక్కడ నుంచి పారిపోయాడు. తర్వాత జరిగిన విషయాన్ని ఆమె భర్తకు ఫోన్ ద్వారా తెలియజేయగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పది ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలతో డీఎఫ్‌వో వినీత్‌కుమార్, అధికారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కడప ఫారెస్టురేంజ్ పరిధిలోని మద్దిమడుగు ఈస్ట్ బీట్‌లో పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా అటవీ అధికారి వినీత్‌కు మార్ తెలిపారు. కడప అటవీ క్షేత్ర కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం తెల్లవారుజామున 3గంటల గంటల సమయంలో కొంత మంది వ్యక్తులు అడవిలోకి వెళ్లినట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో కడప రేంజ్ కార్యాలయ పరిధిలోని సిబ్బంది మద్దిమడుగు ఈస్ట్‌బీట్ పరిధిలో గాలింపు చర్యలు చేపట్టగా 6.30 గంటలకు చల్లపల్లి బావి వద్ద పది మంది తమిళ కూలీలు కనిపించారన్నారు. అటవీ సిబ్బం దిని చూసి దుంగలను అక్కడే వదిలేసి పారిపోతుండగా తమిళనాడు ధర్మపురి జిల్లాకు చెందిన రమణ ఆడియన్ అనే వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు. మిగిలిన 9 మంది పారిపోయారని.. వారి కోసం గాలింపు చేపట్టామన్నారు. కూలీలు వదిలి వెళ్లిన దుంగలను స్వాధీనం చేసుకున్నామని.. వాటి బరువు 490 కేజీలు ఉంటుందన్నారు. ఈ వ్యవహారంలో స్థానికుల ప్రమేయం ఏదైనా ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. సమా వేశంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసరు ప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసరు ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు మట్కా బీటర్లు అరెస్టు



మట్కా బీటర్లను చూపుతున్న ఎస్ఐ హనుమంతు

ప్రొద్దుటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం సాయికుటీర్ రోడ్డులోని విహంగ అపార్ట్‌మెంట్ ఎదురుగా మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లను గురువారం మధ్యాహ్నం త్రీటౌన్ ఎస్ఐ హనుమంతు ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.95 వేల నగదుతో పాటు మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన జి.విశ్వనాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన జె.నరసింహులు, ప్రొద్దుటూరు టౌన్ దేవాంగపేటకు చెందిన జి.వీరయ్యలు వున్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ సాధనపై రేపు సదస్సు

కడప సెవెన్ రోడ్స్, మే 22(ఆంధ్రజ్యోతి): కరువు, వలసలు, ఆత్మహత్యల విముక్తికి, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఈనెల 24వ తేదీన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఉక్కు సాధన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో టీడీపీ మహానాడు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజల ఆకాంక్ష అయిన కడపలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జరిగే ఉక్కుసాధన సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మూగజీవాల దాహం తీర్చడం అభినందనీయం

వల్లూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మూగజీవాల దాహం తీర్చడం అభినందనీయమని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. మూగజీవాల దాహం తీర్చేందుకు రేపటి మార్పు కోసం యూత్ సభ్యులు మండలంలో పలుచోట్ల నీటితొట్లను ఏర్పాటు చేశారు. గురువారం ఈ తొట్లలో నీరుపోసి ఎస్ఐ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు మున్ముందు మరిన్ని చేయాలని, అందుకు తన తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రేపటి మార్పు కోసం యూత్ సభ్యులు ఆంజనేయులు, మహేశ్ బాబు, బాబు, వరుణ్, సాయి నరసింహారెడ్డి, రమణయ్య, సందీప్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి యోగా ఎక్సలెన్స్ అవార్డు

వేంపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ యోగా అధ్యాపకుడు సోమేపల్లె అశోక్‌కు యోగా ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలోని కౌసర్‌బాద్ గాంధీ ఆడిటోరియంలో జరిగిన యోగా-2025 కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. దేశవ్యాప్తంగా యోగాను విస్తృతపరిచే కార్యక్రమంలో భాగంగా రుషికల్ యోగా పీఠ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో దేశం నలుమూలల నుంచి యోగాథెరపిస్టులు, ఇన్‌స్ట్రక్టర్లు, నిపుణులు హాజరయ్యారు.

పవన పుత్రా.. పాహిమాం..

- వైభవంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

వల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పవన పుత్రా.. పాహిమాం అంటూ భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని గోటూరు, కుమారునిపల్లె, వల్లూరు, పెద్దపుత్తలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయాల్లో జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గోటూరు వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడికి ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బండలాగుడు పోటీలు ప్రారంభించారు.

చెన్నూరులో..

చెన్నూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా చెన్నూరు బ్రాహ్మణవీధిలో కొలువైన ఆంజనేయుడికి పలురకాల పుష్పాభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరరణ, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఊరేగింపులో మంగళవాయిద్యాలు, తప్పెట్లు, కోలాటం, చెక్కభజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చెన్నూరు వీరహనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

కడపలో..

కడప కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలోని అమ్మవారిశాల వీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో స్వామివారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయుడికి పంచామృతాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, అన్నప్రసాద వినియోగం నిర్వహించారు. శంకరాపురం హనుమాన్ ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకుడు తుంగా రమణయ్య, భక్తులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత ఒంటిగారి వెంకటసుబ్బానాయుడు ఆధ్వర్యంలో వైభవంగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. డప్పువాయిద్యాల మధ్య బాణాసంచా పేల్చుతూ జైశ్రీరామ్ అంటూ భక్తులు నినాదాలతో వీరపునాయునిపల్లె మార్మోగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెయిన్‌బజార్‌లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు చేశారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం మేళతాళాలు, కోలాట నృత్యాల మధ్య స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

చక్రాయపేటలో శోభాయాత్ర

చక్రాయపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వర, రాచరాయ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో హనుమత్‌జయంతి సందర్భంగా గురువారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర భారత దేశ సైనికులకు మనోధైర్యం కల్పించాలని, మృతిచెందిన వారికి మనశ్శాంతి కలగాలని, హనుమంతుని జన్మదిన సందర్భంగా బైకు ర్యాలీ నిర్వహించారు. గండి క్షేత్రం నుంచి ప్రారంభమైన బైకు ర్యాలీ అద్దాలమర్రి, చెరుకాంపల్లె, కుమార్లకాల్వ, రాచుపల్లె, కుప్పం, బురుజుపల్లె, నెర్సుపల్లె, మహదేవపల్లె, సురభి, నాగులగుట్టపల్లె, చిలేకాంపల్లె, చక్రాయపేట వరకు సాగింది. చక్రాయపేటలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో బీసీ యునైటెడ్ ఫ్రంట్ ఇందుకూరు శ్రీనివాసులు, రామ్మోహన, గంగిరెడ్డి, రెడ్డప్పరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వల్లూరు: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి : ఆర్సీపీ



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): బుద్ధ రియల్ ఎస్టేట్ అనుబంధ వెంచర్‌లైన భావన టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ భూములను కలెక్టరు నివేదిక ప్రకారంగా తక్షణమే స్వాధీనం చేసుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో పాత్రధారులైన అధికారులు, అనధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు. సీకేదిన్నె మండలం ఊటుకూరు గ్రామ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా భావన టౌన్‌షిప్‌ను నిర్మించారని ఆరోపించారు. ఈ విషయంగా గత వైసీపీ ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు పోరు సాగిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆ భూములను స్వాధీనం చేసుకోకపోతే ఉద్యమం తిరిగి కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మగ్బుల్‌బాషా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్'ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

కడప మారుతీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు ఇచ్చిన హామీల సాధన కోసం ఈనెల 26వ తేదీన చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుభాషిణి, గౌరవ అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఆశా కార్యకర్తలకు గ్రాడ్యుటీ కింద రూ.1.50 లక్షలు, రిటైర్‌మెంటు వయసు 62 సంవత్సరాలకు పెంపు, 180 రోజుల చొప్పున రెండు కాన్పులకు వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు ఇస్తున్నట్లు ప్రకటించారని, అయినా ఇంతవరకు ఆ హామీలు అమలు కాలేదన్నారు. వెంటనే ఆ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోశాధికారి అమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

ఆ రింగ్ లీడర్ ఆస్తులపై విచారణ జరపాలి

- ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

కడప మారుతీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో రింగు లీడరుగా విధులు నిర్వహిస్తున్న ఆర్వో భాస్కర్‌గౌడ్ ఆస్తులపై తక్షణమే విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కారు ఆంజనేయులు, అవ్వారు మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భాస్కర్‌గౌడ్‌కు ఆర్వో స్థాయి అధికారాలను తప్పించి కార్పొరేషన్‌లోనే మరో సీటు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతూ రింగు లీడరుగా వ్యవహరిస్తున్న ఆర్వో భాస్కర్ గౌడ్‌ను విధులు నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈనెల 27 నుంచి జరిగే మహానాడు కార్యక్రమంలో స్వయంగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కడప కార్పొరేషన్‌లో దాదాపు రూ.5వేల కోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు. ఒక రెవెన్యూ సెక్షన్‌లోనే సుమారు రూ.వంద కోట్లు కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం ఇతరుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు జేవీ రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి రాక

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి నేడు కడపకు రానున్నారు. హైదరాబాదు నుంచి విమానంలో మధ్యాహ్నం 12.35గంటలకు కడపకు చేరుకుంటారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు అధికారులు, అనధికారులతో సమావేశమవుతారు. కడపలోనే రాత్రి బస చేసి తిరిగి శనివారం విమానంలో విజయవాడకు బయలుదేరుతారు. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ షెడ్యూలు జారీ చేసింది.

కగార్ ఆపరేషన్‌పై చర్చ జరగాలి : సీపీఎం

కడప సెవెన్ రోడ్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజానీకం, గిరిజనులపై జరుగుతున్న కగార్ ఆపరేషన్‌పై పార్లమెంటులో చర్చ జరగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాడ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో సీపీఎం నగర కమిటీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 మార్చి 26 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి పాలకపక్షం, ప్రతిపక్షాలతో సంప్రదించకుండా కగార్ ఆపరేషన్ ప్రారంభించిందని, కేవలం వ్యక్తులను నిర్మూలించినంత మాత్రాన వారి సిద్ధాంతాలను ప్రజల నుంచి వేరుచేయలేరన్నారు. నాగరికతకు దూరంగా దండకారణ్యంలో ఉన్న 1.25కోట్ల మందికి పైగా గిరిజనులకు రోడ్డు, కరెంటు, మంచినీరు, స్కూలు, ఆసుపత్రి, రవాణా సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కల్పిస్తే మావోయిస్టుల అవసరం ఉండదన్నారు. సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, నగర కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీని జయప్రదం చేయండి

కమలాపురం రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 28వ తేదీన నిర్వహించే మోడల్ డీఎస్సీ పరీక్షను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. గురువారం ఆచప విలేకరులతో మాట్లాడుతూ మోడల్ డీఎస్సీ పరీక్ష ఎస్‌జీటీ అభ్యర్థులకు మాత్రమేనని, ఈ పరీక్ష పేపరును ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందించారన్నారు. డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

బదిలీల సహకార కేంద్రం ఏర్పాటు : యూటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బదిలీలకు సహకార కేంద్రం ఏర్పాటు చేసినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. గురువారం కడప యూటీఎఫ్ భవన్‌లో ఉపాధ్యాయ సహకార కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని తీసుకువచ్చి బదిలీలు జరుపుతోందని, ఇందుకు సంబంధించి సమస్యల పరిష్కారానికి, ఆన్‌లైన్‌లో అప్లికేషన్ సబ్మిట్ చేయుటకు, బదిలీల ప్రక్రియలో తలెత్తే సమస్యలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బదిలీల ప్రక్రియ ముగిసే వరకు యూటీఎఫ్ భవన్‌లో సహకార కేంద్రాన్ని నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

కడప సెవెన్ రోడ్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు త్వరగా న్యాయం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు ప్రభుత్వాన్ని కోరారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం జరిగింది.

దివ్యాంగుల సర్వే సమగ్రంగా చేయాలి

- ఎంఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ నరసింహరాజు

వేంపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రంలో చేర్పించేందుకు ఎక్కడెక్కడ దివ్యాంగ పిల్లలు ఉన్నారో సమగ్ర సర్వే చేయాలని ఎంఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ నరసింహరాజు ఆదేశించారు. వేంపల్లెలో భవిత కేద్రం ఆధ్వర్యంలో ఐఈఆర్టీలు నిర్వహిస్తున్న దివ్యాంగుల సర్వేను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్పటి వరకు ఎంతమందిని గుర్తించారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. 18ఏళ్లలోపు ఉన్న దివ్యాంగ చిన్నారులను గుర్తించి బడిలో చేర్పించాలని తెలిపారు. దివ్యాంగ పిల్లలను సాధారణ స్థితికి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, వాటిని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు యశోద, సుజాత, మండల కన్వీనర్ అబ్దుల్‌ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ చిన్నారుల సర్వేను తనిఖీ చేస్తున్న నరసింహరాజు

'వెన్నుపోటు రాజకీయాలు మానుకోవాలి'

కడప ఎర్రముక్కపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి వెన్నుపోటు రాజకీయాలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, బి.హరిప్రసాద్ హితవు పలికారు. గురువారం నగరంలోని హరి టవర్స్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. లక్ష్మిరెడ్డి ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ కోసం పనిచేసిన దాఖలాలు లేవని, ఎప్పుడూ తన స్వార్థప్రయోజనాల కోసం చిల్లర రాజకీయాలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. 2001లో టీడీపీకి వ్యతి రేకంగా పనిచేసినందుకు అప్పటి ఇన్‌చార్జి ఖలీల్ బాషా లక్ష్మిరెడ్డిని సస్పెండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొన్న జరిగిన ఎన్నికల్లో కూడా వైసీపీ అభ్యర్థి అంజాద్ బాషా ఇంట్లో మంతనాలు చేసినది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. లక్ష్మిరెడ్డి ప్రాతినిధ్యం వహించిన ఆలంకాన్‌పల్లెలో ఎప్పుడైనా టీడీపీకి మెజార్టీ వచ్చిందా, 2019 నుంచి 2024 మధ్యలో టీడీపీ ఎన్నో ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టిందని, ఒక్క కార్యక్రమానికైనా లక్ష్మిరెడ్డి హాజరయ్యారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్‌ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహానాడు విజయవంతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటిసారి జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అందరం కలిసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయానికి ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలతో జన సమీకరణకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనపై ఎంతో నమ్మకంతో అధిష్టానం మన నియోజకవర్గంలోని పబ్బాపురంలో ఈనెల 29న మహానాడు సభను నిర్వహిస్తున్నారని, నియోజకవర్గం నుంచి 50వేల మందిని తరలించాలన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు రాఘవరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, వాసుదేవరెడ్డి, గంగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, జంపాల నరసింహారెడ్డి, దాదిరామయ్య, ఎల్లారెడ్డి, చిన్న క్రిష్టారెడ్డి, మల్లేశ్‌రాయల్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిచ్చమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి



కలెక్టరేట్ వద్ద పిచ్చమ్మ కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష నేతలు

కడప సెవెన్ రోడ్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలోని శివానందపురంలో పిచ్చమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని అఖిలపక్ష నేతలు డిమాండు చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద పిచ్చమ్మకు జరిగిన అన్యాయంపై అఖిలపక్ష నేతలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ పిచ్చమ్మ ఇంటిని కూల్చిన దుండగులకు శిక్షపడాలన్నారు. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రిమ్స్ సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు. పక్షవాతం సోకిన కూతురితో కలిసి జీవిస్తున్న దళిత వృద్ధురాలు పిచ్చమ్మపై దాడి చేసి ఇంట్లోంచి గెంటేసి, ఇంటికి బీగం వేసిన కాల్‌మనీ దందాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీకి విన్నవించిన రెండు రోజుల్లోనే మరోమారు దాడి చేసి పిచ్చమ్మ ఇంటిని జేసీబీతో కూల్చి నేలమట్టం చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై, అక్రమార్కులకు అండగా నిలిచిన రిమ్స్ సీఐ, ఎస్ఐలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ రాయలసీమ మానవ హక్కుల వేదిక నేత జేవీ రమణ, బీసీ మహాసభ అవ్వారు మల్లికార్జున, ఆర్సీపీ నేత ప్రసాద్, సీహెచ్ఆర్‌డీ శివారెడ్డి, ఆప్ శ్రీనివాసులు, లోక్‌సత్తా శ్రీకృష్ణ, హేతువాద సంఘం నేత సీఆర్‌వీ ప్రసాద్, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక ఆంజనేయులు, బీసీ వేదిక నేత డీఎం ఓబులేసు, వెంకటశివ, మునెయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల అరెస్టు దుర్మార్గం : కాంగ్రెస్

పులివెందుల టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని పీసీసీ డెలిగేట్ శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. విశాఖలో కార్మికులకు మద్దతుగా షర్మిల చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. షర్మిలపై బనాయించిన అక్రమ కేసును ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

ఘనంగా వేటూరి వర్ధంతి

కడప మారుతీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా పెన్షనర్స్ కార్యాలయంలో సినీ రచయిత వేటూరి సుందరరామమూర్తి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేటూరి సుందరరామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అటు మాస్, ఇటు క్లాస్ సినీ గీతాల రచనతో పాటు శృంగార గీతాల రచనలో వేటూరి సామ్రాట్ అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. తెలుగు సినీ చరిత్రలో ఓ సీత కథ సినిమా ద్వారా ఆయన సినీ రచయితగా జీవితాన్ని ప్రారంభించి దాదాపు తొమ్మిదివేలకు పైగా పాటలు రాశారన్నారు. కార్యక్రమంలో పలువురు పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంత్యుత్సవాలు

●భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● అంజనీపుత్రుడు హనుమంతుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ● ఘనంగా శోభాయాత్రలు, ఆకట్టుకున్న భక్తుల చెక్కభజనలు, కోలాటాలు


బద్వేలులో అలంకరణలో ఆంజనేయ స్వామి


బద్వేలు గాండ్లవీధి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


చాపాడులో స్వామివారు


అట్లూరులో..


ప్రొద్దుటూరు పాత మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి

జమ్మలమడుగు, మే 22 (ఆంధ్రజ్యోతి):వాయు పుత్రా నమోస్తుతే.. అంటూ అంజనీ తనయుడు ఆంజనేయ స్వామివారి జయంత్యుత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో హనుమద్ ఆలయాలు వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామివారికి ఆకుపూజలు, వడమాల పూజలతోపాటు అభిసేకార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. జమ్మలమడుగు మండలంలోని గండికోట సమీపాన ప్రధాన రోడ్డు పక్కన ఆంజనేయస్వామి గుడిలో గురువారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పూజలు చేసి స్వామివారిని మొక్కుకున్నారు. హనుమజ్జయంతిని పురష్కరించుకుని గ్రామ సర్పంచ్ ఈశ్వర్, స్థానిక నాయకులు భూపేశ్‌రెడ్డిని ఆహ్వానించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అలాగే జమ్మలమడుగులోని అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామ కల్యాణ కార్యక్రమం జరిగింది. మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామం ఆంజనేయస్వామి గుడి వద్ద, దేవగుడి గ్రామం, గూడెం చెరువు, మోరగుడి, తదితర గ్రామాలోల్ల ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

కొండాపురంలో: మండలంలో హనుమజ్జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ, రామాలయాల్లోను హనుమంతుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. గండ్లూరులో రెండుచోట్ల, చౌటిపల్లె, దత్తాపురం తదితర చోట్ల ఆంజనేయస్వామి ఆలయాల్లో అన్నదానం, భజనలు ఏర్పాటుచేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బద్వేలు/రూరల్‌లో: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునుంచే ఆంజనేయ స్వామి ఆలయాలను దర్శించుకుని హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం పట్టణంలోని పలు పురవీధుల గుండా ఆంజనేయ స్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అలాగే గాండ్లవీధి, ఆంజనేయ నగర్ ఆలయాల్లో వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్న దానం చేశారు.

అట్లూరులో:మండలంలోని కొండూరు, అట్లూరు, లింగాలకుంట, కమలకూరు, ముత్తుకూరు, వేములూరు గ్రామాల్లోవెలసిన ఆంజనేయస్వామి ఆలయాలలో అంజన్నకు గురువారం ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానాలు చేశారు. అనంతరం చెక్క భజనలు, కోలాటాలు నిర్వహించారు.

బి.కోడూరులో : మండల పరిధిలోని కొండంపల్లె గ్రామ సమీపాన బద్వేలు- పోరుమామిళ్ల మెయిన్ రోడ్డుకు వెలసిన సువర్చలాదేవి సమేత అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్చలాదేవి సమేత అభయాంజనేయస్వామి వార్ల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అక్కడకు వచ్చిన భక్తులకు శ్రీకొండ మీది స్వామి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

చాపాడులో: మండలంలోని విశ్వనాధపురం, తిప్పిరెడ్డిపల్లె, సీతారామపురం, తూర్పు అనంతపురం, నక్కలదిన్నె గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సీతారామపురం గ్రామంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి కల్యాణాన్ని తిలకించారు. అన్ని గ్రామాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

దువ్వూరులో: దువ్వూరు సమీపంలోని ఆంజనేయస్వామి గుడిలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హనుమంతుడికి పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదానం, చెక్కభజన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ముద్దనూరులో:మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ధర్మకర్తలు ఉమ్మడిశెట్టి సురేష్, సుధాకర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి ,బీజేపీ మండల నాయకులు మధుసూదనరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. డీఎన్‌పల్లెలోని బురుజు ఆంజనేయస్వామి ఆలయం, బొందలకుంటలోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

మైలవరంలో: మండలంలో హనుమజ్జయంతిని పురష్కరించుకుని ఆయా గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామికి గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలో ప్రముఖ ఆలయమైన జి.ఉప్పలపాడు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి ఉదయం నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్కభజన, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు.

ఖాజీపేటలో: మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు, తవ్వారుపల్లె, సుంకేసుల గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయకొట్టాలు గ్రామంలో మధ్యాహ్నం భారీగా అన్నదానం నిర్వహించారు. రాత్రి గ్రామంలో ఊరేగింపు నిర్వహించడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బ్రహ్మంగారిమఠంలో: మండల కేంద్రంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో భక్తిశ్రద్దలతో హనుమజ్జయంతి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పంచామృతాభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. అనంతరం రాత్రికి ఘనంగా గ్రామోత్సవం చేపట్టారు. చాపాడు వెంకటసుబ్బారెడ్డి, ఆల య నిర్వాహకుడు నాగయ్య, ప్రోగ్రాం అసిస్టెం టు గోపిబాబు, చెన్నారెడ్డి, క్రిష్టారెడ్డి, నాగిరెడ్డి, పెంచలారెడ్డి, రామిరెడ్డి, నాగేశ్వర్‌రావు, రామసుబ్బారెడ్డి, శ్రీనివా సులరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.


బి.కోడూరులో సువర్చదేవి సమేత అభయాంజనేయస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భక్త జనసందోహంతో సాగిన శోభాయాత్ర

ప్రొద్దుటూరు టౌన్/ఎర్రగుంట్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురష్కరించుకుని జై శ్రీరాం భక్తబృందం ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ శోభయాత్రను భక్త జనసం దోహం నడుమ వైభవంగా నిర్వహించారు. పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి దర్గాబజార్, సుందరాచార్యుల వీధి, బొల్లవరం ఆంజనేయస్వామి గుడి, టీబీ రోడ్డు మీదుగా అభయ ఆంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది. ఈ సందర్భంగా శోభాయాత్రలో పాల్గొన్న వారికి మున్సిపల్ కమిషన్ మల్లికార్జున మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దశమందం బాబు, రాజశేఖర్, శివనాగిరెడ్డి, పుల్లారెడ్డి, వెంకటేషు, ప్రశాంత్, సాయిమనోజ్, పాల్గొన్నారు. హనుమజ్జయంతి సందర్భంగా ఎర్రగుంట్లలో గురువారం శోభాయాత్రను భక్త జనసందోహం నడుమ వైభవంగా నిర్వహించారు. నడిపూ రు రామాలయం నుంచి ఆర్ఎస్ ఎస్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి విగ్రహ ఊరేగింపు జరిగింది. భక్తులు జైరాం అం టూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. అలాగే తిప్పలూ రు తదితర చోట్ల హనుమత్ జయంత్యుత్సవాలు బారీగా సాగాయి.


ఎర్రగుంట్లలో శోభాయత్రలో పాల్గొన్న భక్తులు

మైదుకూరు రూరల్‌లో: మైదుకూరులో హనుమజ్జయంతి ఉత్సవ వేడుకలు మైదుకూరులో వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం, శ్రీనగరంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద, కేశలింగాయపల్లెలో వేడుకలు నిర్వహించారు. కేశలింగా య పల్లె గ్రామంలో గ్రామస్థులందరూ హనుమా న్ శోభయాత్రలో ఆంజనేయస్వామి చిత్ర పటంతో గ్రామంలో ఊరేగింపు చేశారు. మధ్యాహ్నం అన్నదానం ఘనంగా నిర్వహించారు.

బద్వేలుటౌన్‌లో: అంజనీపుత్రుడు శ్రీరామ చంద్రుడికి పరమభక్తుడైన హనుమజ్జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని బైపాస్‌రోడ్డు వీరాంజనేయస్వామి ఆలయం నుంచి నాలుగు ప్రధాన రహదారుల్లో బైకు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు సిద్దవ టంరోడ్‌లో వెలసిఉన్న మహాలక్ష్మీ గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలో, భావనారాయణనగర్‌లోని వీరాంజనేయస్వామి ఆలయంలో, ఆంజనేయనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మీగోదాదేవి సహిత అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తాదులకు ఆలయనిర్వాహకుడు వల్లెంకొండు వెంకటరమణ ఆధ్వర్యంలో భారీగా అన్నదానం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

పోటా పోటీగా సాగిన బండలాగుడు పోటీలు

కాశినాయన మే22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలూరు గ్రామంలో గురువారం హనుమజ్జయంతి ముత్తుముల రవీంద్రా రెడ్డి సొంతనిధులతో అన్నదానం, బండలాగుడు పోటీలు, పెద్దఎత్తున నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా గుంపరమనుదిన్నె వాసి రాంభూపాల్ రెడ్డి ఎద్దులు ప్రధమస్థానంలో నిలిచి రూ.100000లు, అనంతపురం జిల్లా గార్లదిన్నె వాసి రామాంజనేయులకు చెందిన రెండు జతల ఎడ్లు ద్వితీయ బహుమతిని రూ.70వేలు, తృతీయ బహుమతిని రూ.40 వేలు, నాల్గవబహుమతిని ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నారాయణ ఎడ్లు రూ.20 వేలు గెలుచుకున్నాయి. పండుగను పురస్కరించుకుని గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందని ముత్తుముల రవీంద్రారెడ్డి ప్రత్యేకంగా కోలాటాలు, చెక్కభజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎడ్లు

ప్రొద్దుటూరులో హనుమజ్జయంతి

ప్రొద్దుటూరు టౌన్/రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం గజమాలలు, వెండి కవచాలతో అలంకరించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలోని కార్యసిద్ధి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిఇంచారు. బొల్లవరంలోని ఆంజనేయస్వామి గుడిలో స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలోని కానపల్లె గ్రామంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి దంపతులు కానపల్లెలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామంలో అన్నదానం చేపట్టారు. ఉప్పరపల్లెలోని సద్గురు సమర్థ నారాయణస్వామి ఆశ్రమంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనున్న ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నదానం చేశారు.

రంగునీళ్లతో పెన్నా కలుషితం

●తాగునీటి కాలువ రంగునీరుగా మారిన వైనం ● హామీలకే పరిమితమైన నేతల ప్రకటనలు ●నీటి కలుషితంతో ప్రజల ఇక్కట్లు

జమ్మలమడుగు, మే 22 (ఆంధ్రజ్యోతి): రంగునీళ్ల కలుస్తుండడంతో పెన్నానది కలుషితంగా మారుతోంది. దీంతో పెన్నా చుట్టుపక్క గ్రామాల ప్రజలకు తాగునీరు కలుషితమై ఇక్కట్లు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామం శ్రీరాములపేట రాణి కాలువ రంగునీళ్లతో నిండి మురుగు కాలువగా మారింది. బ్రిటీష్ కాలంలో మోరగుడి గ్రామం శ్రీరాములపేట వద్ద పెన్నానది నుంచి పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి మంచినీటి కోసం కాలువ తీశారు. ఇది అప్పట్లో రాణి కాలువగా పేరుపొందింది. అప్పటి నుంచి ఇప్పటివరకు రాణికాలువ పోయి రంగునీళ్ల కాలువ, తర్వాత మురుగునీటి కాలువగా మారుతూ వస్తోంది. మోరగుడి గ్రామంలో లో అద్దకం బట్టీల నుంచి వచ్చే కెమికల్‌తో కూడిన రంగునీళ్లు కాలువ గుండా ప్రవహిస్తూ మైలవరం మండలం దొమ్మరనంద్యాలజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన పెన్నానదిలో కలుస్తున్నాయి. ఈ రంగునీళ్లు పెన్నానదిలో కలుషితమై అక్కడి బోర్లలో చేరుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గత 20 సంవత్సరాల క్రితం జమ్మలమడుగులో ఇప్పటి వరకు గెలుపొందిన ఎమ్మెల్యేలు సైతం రాణికాలువకు మంచిరోజులు వస్తాయని, కాంక్రీటుతో కాలువ నిర్మాణం చేపట్టి రంగునీళ్లు పెన్నాలో చేరకుండా చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చి ఎన్నికల్లో విజయం సాధించడం ఆ తర్వాత కాలువ గురించి పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అద్దకపు బట్టీల కెమికల్‌తో కూడిన రంగునీళ్లు శ్రీరాములపేట వద్ద నుంచి పెన్నానదిలోకి నేరుగా కలుస్తున్నాయి. రాణికాలువ ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునేవారే లేరని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కాలువను పరిశీలించి తగు చర్యలు తీసుకోవడంతోపాటు కనీసం రంగునీళ్లు పెన్నా లో చేరకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


పెన్నానదిలో కలుస్తున్న రంగునీళ్లు


రోడ్డు పక్కన కంపుకొడుతున్న రంగునీళ్ల కాలువ

జేవీవీ పిల్లల కథా వర్క్‌షాప్

ప్రొద్దుటూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలను కథా రచనలో సృజనాత్మకతను పెంచడానికి 24, 25 తేదీల్లో కథా వర్క్‌షాప్ కథా వసంతం 2కె25 పేరుతో నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ కార్యదర్శి వేంపల్లె రాజశేఖర్‌లు తెలిపారు. గురువారం జేవీవీ కార్యాలయంలో కథావసంతం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కథావసంతంలో బాలసాహిత్య రచయితలు, కథా రచయితలు పాల్గొంటారన్నారు. మానవ సంబంధాలు అంశంపై బాల సాహిత్య రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి వివరిస్తారని తెలిపారు. జేవీవీ నాయకులు గోపీనాథ్‌రెడ్డి, దేవానంద్, ఈశ్వరయ్య జుబేదా, హాసిని, గురుచందన, భరత్, నరసింహ పాల్గొన్నారు.

గోశాలను సందర్శించిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామనూరు గ్రామంలో ఉన్న ప్రసన్న మాధవ వేణుగోపాలస్వామి గోశాలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సందర్శించారు. గురువారం హనుమజ్జయంతి సందర్భంగా గోశాలకు వెళ్లి అక్కడ ఆవులకు పలు రకాల కూరగాయలు, పండ్లను తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టౌన్‌బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లె కాలువల్లో పూడిక తీత పనులు

ప్రొద్దుటూరు , మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకోని పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. గురువారం స్థానిక మోడంపల్లెలోని శేషాద్రిఅపార్ట్‌మెంట్ దగ్గర కొత్తపల్లె కాలువలో పూడిక తీత పనులను మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. ఈ పూడిక తీత పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తదితరులు పర్యవేక్షించారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి పేర్కొన్నారు. గురువారం జనసేన పార్టీ సభ్యత్వం చేసుకున్న కార్యకర్తలకు సభ్యత్వం కార్డులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంపిన సందేశ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హరీష్‌కుమార్, చంద్రకాంత్, బాలాజీ, వీరయ్య, సుకన్య, రవి, చంద్రశేఖర్‌లున్నారు.

కొండాపురం విద్యుత్‌శాఖ ఏఈగా వీరారెడ్డి

కొండాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్‌శాఖ ఏఈగా వీరారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన దువ్వూరు నుంచి ఇక్కడకు వచ్చారు. విద్యుత్ అంతరయం లేకుండా చూస్తామని తెలిపారు.

పల్లవోలు ఎంపీటీసీ సుందరమ్మ మృతి

చాపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పల్లవోలుకు చెందిన ఎంపీ టీసీ నగర్తి సుందరమ్మ(70) గురువారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా ఆమె నారోగ్యంతో బాధపడుతూ ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె కుమారుడు జాన్సన్ సర్పంచ్‌గా ఉన్నారు.

సిద్ధేశ్వరం అలుగుతోనే రాయలసీమ సస్యశ్యామలం

ప్రొద్దుటూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగుతోనే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ ఎస్‌పీ మహమూద్ పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 31న సంగమేశ్వరం వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం వలన కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 50 టీఎంసీల నీరు నిలువ చేసుకునే అవకాశం ఉందని, ఆ నీటితో సీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. విరసం సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ అసమానతల వలనే తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించిందని, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి సిద్ధేశ్వరం అలుగు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈనెల 31న నిర్వహించే భారీ బహిరంగ సభను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, రాయలసీమ విద్యార్థి సంఘం కన్వీనర్ హరిత, వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'అన్న క్యాంటీన్‌లో ఒకరోజు పేదలకు ఉచిత భోజనం'

జమ్మలమడుగు, మే 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ చైర్‌పర్సన్ శివమ్మ భర్త డాక్టర్ రామేశ్వరుడు పెళ్లి రోజును పురష్కరించుకుని గురువారం జమ్మలమడుగులోని అన్న క్యాంటిన్‌లో పేదలకు ఒక్కరోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్, వారి సిబ్బంది వెళ్లి చైర్‌పర్సన్ శివమ్మ 40వ వివాహ వార్షికోత్సవం పురష్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు.

మోడల్ డీఎస్సీని జయప్రదం చేయండి

బద్వేలు ,మే 22 (ఆంధ్రజ్యోతి): మోడల్ డిఎస్సీ పరీక్షను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని కోరారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త లక్ష్మణరావు తయారు చేశారన్నారు. 9059414222, 7799506227 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

దళిత, గిరిజనులకు కుట్టు శిక్షణ ఏర్పాటుచేయాలి

కొండాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు ఏర్పాటుచేసినట్లుగానే దళిత, గిరిజనులకు మండలంలో కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దళిత, గిరిజన నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో నాగప్రసాద్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. వెంటనే ఎస్సీ, ఎస్టీలకు కుటుమిషన్ కేంద్రాలను ఏర్పాటు చేయకపోతే ఆందోళనలు చేపడతా మని హెచ్చరించారు. ఈ దళిత, గిరిజన నాయకులు మనోహర్‌బాబు, నాగసుబ్బరాయుడు, సూరి పాల్గొన్నారు.

తిరంగార్యాలీ విజయవంతం

దువ్వూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా ర్యాలీ విజయవంతమైంది. నాయకులు ఆరవేటి హరికృష్ణ, అమ్మిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి బైకుల్లో జెండాను పట్టుకుని పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యారు. దువ్వూరులోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ప్రొద్దుటూరు దారిలో ఉన్న పెట్రోలు బంకు వరకు, అటు నుంచి పుల్లారెడ్డిపేట వరకు ర్యాలీ కొనసాగింది. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో ఏర్పరచిన సమావేశంలో నాయకులు వీరజవాన్ మురళీనాయక్ సేవలను గుర్తు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.



గర్భిణులు ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి

చాపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు బలమైన ఆహారంకోసం ఆకుకూరలు, కర్జూరం, చిక్కీలు తినాలని డీఎంహెచ్‌వో నాగరాజు అన్నారు. చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భవతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులకు బీపీ, షుగర్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీపీ ఉంటే కడుపులో పెరిగే పిండాలకు లోపం ఏర్పడుతుందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేసు, డాక్టర్లు రాజేష్‌కుమార్, శ్రీవాణి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.